
## అనర్హుల చేతిలో రేషన్ కార్డులు







## ఎస్సారెస్పీపై పర్యాటకుల సందడి..



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com



## సీఎంను కలిసిన కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కూతురు వివాహ విందు జుక్కల్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేడుకకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు.



**పరీక్షల ఒత్తిడి, పోటీ, స్నేహితులతో పోలిక, ఇంట్లో అంచనాలు.. చిన్న విషయం కూడా పెద్ద సమస్యలా అనిపించే వయసులో ఉన్న విద్యార్థుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఆనందంగా చదువుకోవాల్సిన విద్యార్థులు ఒత్తిడికి గురి అవుతున్నారు. ఫలితంగా క్షణికావేశానికి గురై తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మానసిక వేదనతో ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.** - అక్షరటుడే, కామారెడ్డి



# క్షణికావేశంలో కఠిన నిర్ణయాలు

- ఆత్మహత్యల బాట పడుతున్న విద్యార్థులు
- 15 రోజుల్లోనే నలుగురు ఆత్మహత్యాయత్నం
- పిల్లల మానసిక స్థితిపై తల్లిదండ్రుల ఆందోళన

కామారెడ్డి జిల్లాలో ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలు కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఆత్మహత్యకు పాల్పడటానికి వెతుకుతున్న కారణాలు తేలికపాటిగా కనిపిస్తున్నా అవి విద్యార్థులకు పెద్దవిగా క ఐపిస్తున్నాయి. గడిచిన 15 రోజుల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యల బాట పట్టడం కలకలం రేపుతున్నాయి. పాఠశాల స్థాయి, ఇంటర్ చదువుతున్న కొందరు విద్యార్థులు మార్కులు తక్కువ రావడం, స్నేహితులతో విభేదాలు, ఇంట్లో మందలింపు వంటి కారణాలతో తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. చాలా మంది పిల్లలు తమ మానసిక ఒత్తిడిని ఎవరితోనూ పంచుకోవడం లేదు. ఎవరితోనూ చర్చించకుండా ఆత్మహత్యల బాట పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ సౌకర్యాలు ఉన్నా వాటిని వినియోగించే వారి సంఖ్య తక్కువగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

### కాపాడిన కుటుంబ సభ్యులు

జిల్లాలో గత 15 రోజుల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యాయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఇద్దరు ఇంటర్, మరొక ఇద్దరు తొమ్మిది, పదో తరగతి చదువుతున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు సమయానికి గుర్తించడంతో ముగ్గురికి ప్రాణాపాయం తప్పిగా ఒక విద్యార్థి ప్రాణం బలైంది. పిల్లల ప్రవర్తనలో మార్పులపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువుపై ఒత్తిడితో పిల్లలు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని కొంతమంది తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. చిన్నపాటి విషయానికి ఆత్మహత్యాయత్నం నిర్ణయాలు తీసుకోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. పిల్లలను ఏమి అంటే ఎలా స్పందిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

### ఇటీవల జరిగిన ఘటనలు

పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి జశ్వంత్ చదువులో వెనుకబడి ఉన్నానని ఆగస్ట్ 9న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గాంధారి మండలం గుర్జాల్ గ్రామంలో పండగకు వచ్చిన అక్కతో గొడవపడి మనస్తాపానికి గురైన 9 వ తరగతి చదివే బాలిక ఆగస్ట్ 13న గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణపాయం తప్పింది. నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన సాయితేజ కామారెడ్డి ఇందిరానగర్ కాలనీలో హాస్టల్ లో ఉండి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చదువు ఇష్టంలేక కొత్త బస్టాండ్ వద్ద ఈ నెల 14న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించారు. రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి సంతోష్‌ను ఫోన్ ఎక్కువగా వాడవద్దని మందలించినందుకు ఈ నెల 14న ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వేగంగా స్పందించడంతో ప్రాణాలతో బయట పడ్డాడు.

### తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

టీనేజి పిల్లల నిర్ణయాలు అనాలోచితంగా ఉంటాయి. ఇంటి సమస్యలు, ఆర్థిక పరిస్థితులు, తోటి విద్యార్థులతో చదువు, ఇతర అంశాలపై పోల్చుకోవడంపై భిన్న పరిస్థితులు ఉంటాయి. ఈ వయసులో వారి బ్రెయిన్ ఎదుగుదల కూడా తక్కువగా ఉంటుంది. దాంతో ఎక్కువగా ఆలోచించి ఆత్మహత్య బాట పట్టే అవకాశాలుంటాయి. వాటి దృష్టి మళ్లించేందుకు తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. వీలైనంత ఎక్కువ సేపు వారితో గడిపి పలు విషయాలపై చర్చించాలి. అప్పుడే పిల్లల్లో ఆత్మహత్య ధోరణి ఆలోచన రాకుండా ఉంటుంది. – **జి రమణ, న్యూరో సైకియాట్రిస్ట్**



## ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో..

**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. మహారాష్ట్రతో పాటు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లోకి 1,013 క్యూసెక్కుల నీరు చేరుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1,079.60 అడుగుల (43.967 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 50.706 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 482 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,013 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టు నీటిమట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు.



## 11వ తర్ప పద్మశాలి సంఘ ప్రమాణస్వీకారం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని నల్ల హనుమాన్ వీధి పద్మశాలి సంఘం 11వ తర్ప నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం అట్టహాసంగా ఈ కార్యక్రమం జరిగింది. తర్ప అధ్యక్షుడు భీమర్తి సురేందర్, ప్రధాన కార్యదర్శి కస్తూరి శ్రీనివాస్, కోశాధికారి సామల అశోక్‌తో పాటు మిగిలిన కార్యవర్గంతో నగర పద్మశాలి సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షుడు కన్న దుబ్బరాజం ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నిజామాబాద్ చేనేత సహకార సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వ,రి కార్పొరేటర్ ప్రసన్న సత్యపాల్, పద్మశాలి సంఘం ప్రతినిధులు పుల్గం హన్మాండ్లు, దాసరి నర్సింలు, చౌటి భూమేశ్వర్, పడాల గంగాధర్, గుజ్జేటి వెంకట్ నర్సయ్య, ఎనగందుల మురళి, అవదూత దశరథం, బూస రవి, చౌకి వరప్రసాద్, అంకం లక్ష్మణ్, లక్కోర రాజేందర్, భీమర్తి రవి, చింతల గంగాదాస్ పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల కేంద్రంలోనే 'ప్రజావాణి'

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మండల స్థాయి 'ప్రజావాణి' కార్యక్రమం సోమవారం నుంచి జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రారంభం కానుంది. ఆగస్టు 17 నుండి ప్రతి సోమవారం జిల్లాలోని ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నారు. దీంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇక జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా, సొంత మండలంలోనే నేరుగా అధికారులకు విన్నవించుకునే అవకాశం లభించింది. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులతో కలిసి అక్కడికక్కడే పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరిస్తారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. సమయపాలనతో, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా సేవలు అందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. 'మీ సమస్యలు ఏవైనా ఉంటే ప్రతి సోమవారం మీ మండల ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి దరఖాస్తు రూపంలో అందజేయాలని' సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర సంబంధిత అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజా సమస్యలు వింటారు.

## ఎమ్మెల్యే ఇంట పెళ్లికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

**అక్షరటుడే, కామారెడ్డి:** జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండలం కంధర్‌పల్లి గ్రామంలో ఆదివారం సందడి నెలకొంది. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు కుమార్తె జొనిటదాస్ వివాహ విందు కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మధ్యాహ్నం 12:40 గంటలకు హెలికాప్టర్ ద్వారా గ్రామ శివారులోని హెలిప్యాడ్ వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. అక్కడి నుంచి 12:45 గంటలకు వివాహ వేడుక జరుగుతున్న ప్రాంగణానికి రాగా.. ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు కుటుంబ సమేతంగా ఘనంగా స్వాగతం పలికారు. వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి వధూవరులు జొనిట, దాస్‌లను ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం సుఖంగా సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. సుమారు 20 నిమిషాల పాటు వేడుకలో పాల్గొని, ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి తిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో గ్రామం అంతా భారీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.







## పోక్సో కేసుల విచారణలో వేగం పెంచాలి: సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన పోక్సో కేసులపై సీపీ సాయిచైతన్య ప్రత్యేకంగా సమీక్షించారు. సీపీ కార్యాలయంలో ఆదివారం పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చిన్నారులపై లైంగిక దాడులు, లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులపై ఆరా తీశారు. ఆయా కేసుల్లో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, సేకరించిన ఆధారాలు, సాక్షుల వివరాలు, బాధిత చిన్నారుల వాంగ్మూలాలు, కేసుల ప్రస్తుత స్థితిగతులపై అధికారులను తెలుసుకున్నారు. ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందనే విషయాన్ని క్షుణ్ణంగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించారు. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని.. బాధిత చిన్నారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని సీపీ అధికారులతో పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో చిన్నారుల భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన ఎఫ్ఎస్ఎల్ పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయించి నివేదికలు పొందాలని ఆదేశించారు. కేసుల్లో లభించిన సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, ఇతర సాంకేతిక ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించి, వాటిని దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. డీసీపీ (అడ్మిన్) శుభంప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేషం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం తహశీల్దార్ కార్యాలయాల్లో ఈ ముసాయిదా ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచుతాం అన్నారు. దీంతో పాటు ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కూడా ఈరోజు నుంచే ప్రారంభం కానుంది. అభ్యంతరాలు, తప్పుల సవరణ, కొత్త ఓటు నమోదుకు సైతం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తులు/సవరణలు సమర్పించడానికి సెప్టెంబర్ 16వరకు చివరి తేదీగా నిర్ణయించారు. అభ్యంతరాల పరిష్కార గడువును ఆగస్టు 17 నుండి అక్టోబర్ 15, 2026 వరకు ఉంది. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19న విడుదల చేయనున్నారు. రెండు నెలల పాటు ఓటర్ల నుంచి తప్పులు ఉన్న పేర్లు నమోదు కాకపోయినా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పిస్తుంది. సర్ ప్రక్రియలో మొదటి ఘట్టం ఇప్పటికే విజయవంతంగా పూర్తయింది. ఎన్నికల సంఘం పంపిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పనులను జిల్లా యంత్రాంగం 100శాతం పూర్తి చేసింది. జిల్లాలోని 3 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 6,96,006 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 6,11,568 మంది ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను స్వీయ నమోదు చేసుకోగా, 84,438 మంది వివరాలను బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి సేకరించారు. జిల్లాలో 87.87 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది.



## వాజ్‌పేయి సేవలు స్ఫూర్తిదాయకం



**అక్షరటుడే, బాన్సువాడ:** బీజేపీ బాన్సువాడ పట్టణ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని అన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం, దూరదృష్టి, సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై చూపిన ప్రత్యేక శ్రద్ధ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశంలో జాతీయ రహదారుల విస్తరణకు వాజ్‌పేయి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిదుర సాయిలు, బీజేపీ కౌన్సిలర్ గజల మహేష్, నాయకులు పాశం భాస్కర్‌రెడ్డి, చీకట్ల రాజు, సాయిరెడ్డి, ప్రదీప్ సింగ్, పురుషోత్తం పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఇంటింటా గాయత్రి యజ్ఞం



**అక్షరటుడే, ఇందూరు:** విశ్వ గాయత్రి యజ్ఞ సమితి ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా 'ఇంటింటా గాయత్రి యజ్ఞం' కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయికృప నగర్‌లో ఉన్న యెర్రగుంట కృష్ణవేణి వంశీ దంపతుల ఇంట్లో యజ్ఞం చేశారు. సుదర్శన ముని పౌరోహిత్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వ గాయత్రి యజ్ఞ సమితి అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి మాట్లాడుతూ తమ సమితి ఆధ్వర్యంలో ప్రతియేటా శ్రావణ మాసంలో ఇంటింటా గాయత్రి యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యజ్ఞం వల్ల ఇంట్లో పరిసరాల్లో రోగక్రిములు నశించడంతో పాటు పవిత్రత ప్రశాంతత లభిస్తుందని రాజేశ్వరి చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వ గాయత్రి యజ్ఞ సమితి పురోహితులు నక్క అంజయ్య, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్వాన పత్రిక ఇచ్చి.. అరెస్టు చేయడం సిగ్గుచేటు



**అక్షటుడే,పెద్ద కొడప్‌గల్:** జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కూతురు పెళ్లికి ఆహ్వాన పత్రిక ఇచ్చి అరెస్టు చేయడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు సుభాష్ ధ్వజమెత్తారు. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి జుక్కల్ ఎమ్మెల్యే కూతురు వివాహానికి వస్తున్న సందర్భంగా ముందస్తుగా బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీనిని బీజేపీ మండల అధ్యక్షుడు సుభాష్ ఖండించారు. పార్టీలకతీతంగా తన కూతురి వివాహానికి రావాలని పిలిచిన ఎమ్మెల్యే అనంతరం తమను అరెస్ట్ చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. శుభకార్యానికి వచ్చే సీఎం రేవంత్ రెడ్డిని అడ్డుకునేంత దిగజారి ప్రవర్తించే పార్టీ బీజేపీ కాదన్నారు. అంత భయం ఉంటే తమకు ముందుగా ఆహ్వానపత్రికలు ఎందుకు ఇచ్చారని బీజేపీ నాయకుడు తానాజీ రావు పటేల్ ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే బీజేపీ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ కృష్ణ పంతులు, మండల బీజేపీ ఉపాధ్యక్షులు ప్రేమ సింగ్, హన్మాండ్లు, రమేష్, క్రాంతి, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# అనర్హుల చేతుల్లో రేషన్‌కార్డులు

**ప్రజా సంక్షేమం పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పథకాలు, అర్హులైన పేదలకు ఆసరాగా నిలవాలి. కానీ అక్రమార్కుల పాలిట అక్షయపాత్రగా మారుతున్నాయి. ఉన్నత కుటుంబాలు సైతం ఓ చేతిలో తెల్ల రేషన్ కార్డు, మరో చేతిలో ఐఫోన్ పట్టుకుని, లగ్జరీ కార్లలో ఉచిత బియ్యం కోసం వస్తున్నాయి. దొడ్డిదారిన సంక్షేమ ఫలాలు కాజేస్తున్న తీరు, రాబోయే ఆర్థిక సంక్షోభానికి ముందస్తు హెచ్చరిక అంటూ హైకోర్టు ఎక్కుపెట్టిన విమర్శలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.**

**– అక్షరటుడే, డిచ్‌పల్లి**




- విచారణ లేకుండానే కొందరికి రేషన్‌కార్డులు
- ఖజానాపై మితిమీరిన భారం..
- అర్హులకు చేరని సంక్షేమ పథకాలు
- అధికారులు దృష్టి సారించాలని వేడుకోలు

డిచ్‌పల్లి మండలంలో ఓ గ్రామ మాజీ సర్పంచ్ కుటుంబానికి పదుల ఎకరాల్లో వ్యవసాయ భూములు, స్థిర, చరాస్తులు, భవంతులు ఉన్నాయి. అయినప్పటికీ.. ఆ ఇంట్లో తెల్ల రేషన్ కార్డు కొనసాగుతోంది. ఈ సంపన్న కుటుంబం ఉచిత రేషన్ బియ్యం పొందడం, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ అందుకోవడం, కూతురి పెళ్లికి 'కల్యాణ లక్ష్మి' పథకం కింద రూ. లక్ష చెక్కును కూడా దక్కించుకోవడం గమనార్హం. సంపన్న వర్గంగా సమాజంలో పేరొందిన ఈ కుటుంబం పేదల కోసం ప్రవేశ పెట్టిన ఫలాలు అనుభవించడం ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచినట్లే అవుతుందనే విమర్శల్ని స్థానికులు వ్యక్తం చేస్తుండటం ఆలోచించాల్సిన విషయం.

### అర్హులకు అందని సంక్షేమ ఫలాలు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో అనేకమంది సంపన్నులు ఉచిత పథకాలతో ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారనేది జగమెరిగిన సత్యం. నిజానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు, చిన్న, సన్నకారు రైతు కుటుంబాల కోసం ప్రవేశ పెట్టిన ప్రభుత్వ ఉచిత పథకాలను, కోటీశ్వరులు దొడ్డిదారి లబ్ధిపొందుతున్న పరిస్థితి కొనసాగుతోంది. అర్హుల గుర్తింపులో వైఫల్యాలు తెల్ల రేషన్ కార్డు అనేది ఒకప్పుడు పేదరికానికి గుర్తింపు కార్డు. అయితే ఈ కార్డు ఉన్నా.. పేదలకు పలు పథకాలు అందడం లేదు. మరోవైపు అనర్హులు మాత్రం పలుకుబడి ఉపయోగించుకొని సంక్షేమ ఫలాలు కాజేస్తున్నారు.

### ఆధార్, డిజిటల్ డేటా అనుసంధాన లోపం..

ఆధార్, డిజిటల్ డేటా అనుసంధాన లోపం, బ్యాంకింగ్ వివరాలు, ఆస్తి రిజిస్ట్రేషన్లు (ధరణి/రెర్ డేటా), ఐటీ రిటర్న్స్, మోటార్ వాహనాల డేటాను రేషన్ కార్డుల డేటాతో సమగ్రంగా అనుసంధానించకపోవడంతో అనర్హులు ఉచిత పథకాలను పొందుతున్నారు. అర్హత లేని వారిని జాబితా నుంచి తొలగిస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే భయంతో అధికారులు, పాలకులు ఏళ్ల తరబడి చర్యలు తీసుకోకపోవడం లేదు.

### ఆడిటింగ్ వ్యవస్థ ఏది..

పథకం అమల్లోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల సామాజికఆర్థిక స్థితిగతులను క్రమం తప్పకుండా సమీక్షించే నిష్పక్షపాత సామాజిక తనిఖీ లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాలు పొందుతున్న లబ్ధిదారుల సామాజిక పరిస్థితులపై ప్రతిఏడాది 'సామాజిక తనిఖీ' చేపడితే అనర్హుల లెక్కతేలుతుంది. దీంతో సర్కారుపై ఆర్థికభారం తగ్గే అవకాశం ఉంటుందని ఆర్థికవేత్తలు చెప్తున్న మాట. సమగ్ర డిజిటల్ ఫిల్టరింగ్, ఆదాయ పన్ను వివరాలు, నాలుగు చక్రాల వాహనాలు, గృహ ఆస్తుల సమాచారం, భూభారతి భూమి రిజిస్ట్రేషన్ల ఆధారంగా తెల్ల రేషన్ కార్డుల డేటాను ప్రక్షాళన చేయాలి. అందరికీ ఉచితాలు ఇచ్చే విధానానికి స్వస్తి పలికి, కేవలం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు మాత్రమే పరిమితం చేయాలి.

### 'కూర్చుంటే సొమ్ము.. నిలుచుంటే సొమ్ము'

కూర్చుంటే సొమ్ము.. నిలుచుంటే సొమ్ము.. అనే తీరుగా పరిమితికి మించి సాగుతున్న ఉచిత పథకాల విస్తరణ, రాష్ట్ర ఆర్థిక పునాదులనే కదిలిస్తోందా?.. అంటూ ఇటీవల హైకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఉచిత పథకాల లబ్ధి పొందేందుకు అర్హతలతో సంబంధం లేకుండా పరుగెడుతున్న తీరును కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇలాగే వదిలేస్తే భవిష్యత్తులో ఎంతటి ధనవంతుడైనా 'పనికి ఆహారం' పథకం కింద కూలీగా నమోదయ్యే ప్రమాదం ఉందని.. భవిష్యత్తు తరాలకు ఏం మిగులుతుందని హైకోర్టు ప్రశ్నించింది. ఉన్నత వర్గాలు, సంపన్నులు అర్హుల జాబితాలో చేరిపోతున్నారని తెలిసినా, ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా ఒక కార్డును కూడా తొలగించలేకపోవడాన్ని కోర్టు ఎత్తిచూపింది.

## ఎస్సారెస్పీపై పర్యాటకుల సందడి..

**శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌పై పర్యాటకులు సందడి చేశారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం, ఆదివారం కలిసి రావడంతో సెలవును సరదాగా గడిపేందుకు పర్యాటకులు ప్రాజెక్ట్‌ను సందర్శిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం కురిసిన వర్షా లకు జలాశయంలో వరద చేరడంతో ప్రస్తుతం ప్రాజెక్ట్ కళకళలాడుతోంది. అలాగే పర్యాటకుల భద్రత దృష్ట్యా పోలీసులు ప్రాజెక్టుపై అప్రమత్తంగా ఉన్నారు.**

**– అక్షరటుడే, బాల్కొండ**







## అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో హన్మాజీపేట్ యువకుల సత్తా

**అక్షరటుడే, బాన్సువాడ:** అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామానికి చెందిన యువకులు అద్భుత ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 80 నిమిషాల నాన్‌స్టాప్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కమ్మరి ఆనంద్, పర్వా వినయ్, వడ్ల శ్రావణ్ పోటీల్లో పాల్గొని 80 నిమిషాల పాటు నిర్విరామంగా రోలర్ స్కేటింగ్ చేసి గోల్డ్ మెడల్ సాధించారు. తమ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన యువకులు హన్మాజీపేట్ గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిని అభినందించారు.

## బాధితుడిని పరామర్శించిన మానాల



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని హాసాకొత్తూరు గ్రామంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, తిప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుంకెట రవి, రఫీ, దేవ రెడ్డి, గడ్డం లింగారెడ్డి పాల్గొన్నారు.

## అంగడిబజార్ ఆవరణలో స్వచ్ఛ భారత్..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కూరగాయల మార్కెట్ (అంగడి బజార్) ఆవరణలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కూరగాలయ మార్కెట్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలు, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సడాక్ వినోద్ మాట్లాడుతూ.. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కూరగాలయ మార్కెట్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో ఈ స్వచ్ఛకార్యక్రమాన్ని గత 67 వారాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్మూర్ అంగడి బజార్ ఆవరణలో స్వచ్ఛకార్యక్రమం నిర్వహించడం తమ అదృష్టమన్నారు. ఇటువంటి స్వచ్ఛకార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూరగాలయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంగాని స్వామి, సామాజిక సేవకుడు తులసి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, వేద జీడి రాజ్ కుమార్, గణేష్, రాహుల్ రాజ్, బొడ్డు రమేష్, బాలు యాదగిరి, రాజయ్య, కృషివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి అండర్–17 చెస్ టోర్నమెంట్ పూర్తి..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'బృంద ఒలింపియాడ్ స్కూల్'లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 బాలబాలికల చెస్ టోర్నమెంట్ ముగిసింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ. రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెస్ ఆర్బిటర్ అప్పారావు, బాలు తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో బొర్రోలా రిషిక్ (విద్యా వికాస్ స్కూల్, బోధన్), రెండో స్థానంలో గౌరంగా (అశోక్ ఆచార్య విద్యాలయం, బోధన్), బాలికల విభాగంలో మొదటి స్థానంలో హర్షిత (నలంద హైస్కూల్), రెండో స్థానంలో ఆర్.అభిజ్ఞ (అభ్యాస ది స్కూల్) నిలిచారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా 43 ఇంటర్‌లింక్ లైన్లు..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 43 ఇంటర్‌లింక్ లైన్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ పీవీ రాజేశ్వర్ రావు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్‌ను సరఫరా చేసే విధంగా ఇంటర్‌లింక్ లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థలో ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు, అలాగే ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మరో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, నిర్దిష్ట సమయాల్లో ఇతర కారణాల వల్ల ఒక లైన్ లేదా సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు, ఇంటర్‌లింక్ లైన్ల ద్వారా ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు వీలుంటుందని తెలిపారు. దీంతో విద్యుత్ వినియోగదారులకు తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఉన్న మొత్తం 218 సబ్‌స్టేషన్లలో 97 సబ్‌స్టేషన్లకు 33 కేవీ లైన్లలో ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. 11 కేవీ ఇంటర్‌లింక్ లైన్లలో ఇప్పటివరకు 528 లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.